# నమస్తే తెలంగాణ
## యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI


# కేసీఆర్ బర్త్‌డే రేపే

ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు

- పలుచోట్ల రక్తదానం, అన్నదానాలకు సన్నద్ధం
- నియోజకవర్గాల వారీగా పలు సేవా కార్యక్రమాలు
- నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ ఆఫీసులో మెగా రక్తదాన శిబిరం



నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి15(నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ సారథి, స్వరాష్ట్ర సాధకుడు, అభివృద్ధి కాముకుడు, బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం కేసీఆర్ 71వ పుట్టినరోజును ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు జన్మదిన వేడుకలను పెద్దఎత్తున నిర్వహించాలని భావిస్తున్నారు. పార్టీ శ్రేణులతోపాటు అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు, సంఘాల ఆధ్వర్యంలోనూ పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎక్కడికక్కడ కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమయ్యారు. వీలైన చోట్ల రక్తదాన శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లోనూ అన్నదానం, ఇతర వస్తువులను పంపిణీ చేయనున్నారు. వీటితోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్డు పంపిణీకి సిద్ధమవుతున్నారు. నల్లగొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ శ్రేణులకు ముఖ్యంగా యువత ఇందులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇక ప్రభుత్వంపై జనంలో తీవ్ర అసంతృప్తి, పథకాల అమలుపై వ్యతిరేకత వెరసి కేసీఆరే మళ్లీ కావాలి... రావాలి అంటూ వెల్లువెత్తుతున్న జనం మనోగతం నేపథ్యంలో అధినేత, అభిమాన నాయకుడు కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగస్వాములు అయ్యేందుకు పార్టీ శ్రేణులంతా ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఇదే సందర్భంగా కేసీఆర్‌కు అత్యంత ఇష్టమైన హరితహారానికి కొనసాగింపుగా పలుచోట్ల మొక్కలు నాటి వృక్షార్చణలో భాగస్వామ్యం అయ్యేందుకు సన్నద్ధమవుతున్నారు. అధినేత కేసీఆర్ బర్త్‌డే వేడుకల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎంగా ఉమ్మడి జిల్లాను గత పదేండ్లు అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్‌కు ఆయన పుట్టిన రోజు సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై కృతజ్ఞత చాటాలన్నారు.



సూర్యాపేటలో మకరతోరణం తరలింపులో పాల్గొన్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

# నేటి నుంచి పెద్దగట్టు జాతర

- అర్ధరాత్రి గంపల ప్రదక్షిణలతో షురూ
- ఐదు రోజులపాటు జరుగనున్న వేడుకలు

చివ్వెంల, ఫిబ్రవరి 15 : రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదైన పెద్ద గట్టు(గొల్లగట్టు) లింగమంతుల స్వామి జాతరకు వేళయ్యింది. సూర్యాపేట జిల్లా కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు యాదవుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరుపొందింది. రెండేండ్లకోసారి జరిగే ఈ జాతర ఆదివారం అర్ధరాత్రి గంపల ప్రదక్షిణలతో ప్రారంభం కానుంది. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలకు సుమారు 20నుంచి 25లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రా ల నుంచి యాదవ భక్తులు పెద్ద ఎత్తున రానున్నారు.

### ఐదు రోజుల విశేషాలు

మొదటి రోజు : జాతర ప్రారంభం సందర్భంగా శనివారం సాయంత్రం మకర తోరణాన్ని జిల్లా కేంద్రం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి అలంకరిస్తారు. ఆదివారం రాత్రి సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి దేవరపెట్టె(అందనపు సౌడమ్మ)ను గట్టుపైకి చేర్చుతారు. అనంతరం అక్కడకు చేరుకున్న భక్తుల పూజా సామగ్రితో ఉన్న గంపల ప్రదక్షిణ చేపడుతారు.

రెండో రోజు : సోమవారం తెల్లవారుజామున స్వామి వారికి భక్తులు బోనాలు సమర్పిస్తారు. సౌడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తారు.

మూడో రోజు : గట్టుపైన ఆలయ ప్రాంగణంలో మంగళవారం చంద్రపట్నం వేస్తారు. లింగమంతుల స్వామి(శివుడు) మాణిక్యమ్మ(పార్వతి) కల్యాణ మహోత్సవం జరిపిస్తారు.

నాల్గో రోజు : ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా బుధవారం నెలవారం నిర్వహిస్తారు. దేవరపెట్టెను తిరిగి కేసారం గ్రామానికి తరలిస్తారు.

ఐదో రోజు : చివరి రోజు దేవతల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజల అనంతరం జాతర ముగుస్తుంది.

### వాహనాల మళ్లింపు

పెద్దగట్టు జాతర సందర్భంగా విజయవాడ–హైదరాబాద్ 65వ జాతీయ రహదారి 65పై వాహనాలు మళ్లించనున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్లగొండ మీదుగా మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ వైపు మళ్లించనున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను కోదాడ వద్ద హుజూర్‌నగర్, నల్లగొండ మీదుగా మళ్లించనున్నారు.

### పెద్ద గట్టుకు చేరిన మకర తోరణం

సూర్యాపేట టౌన్ : పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయంలోని సౌడమ్మ తల్లి గుడి ముందు పెట్టడానికి మకర తోరణాన్ని సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్‌లో కోడి వంశస్తుల నివాసం నుంచి యాదవులు పెద్దఎత్తున ర్యాలీగా పెద్దగట్టుకు చేర్చారు. లింగా.. ఓ లింగా అంటూ భేరీల చప్పుడు, కత్తుల విన్యాసాలతో కదిలివచ్చారు. ఈ సందర్భంగా మకరతోరణం వద్ద రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, పెద్దగట్టు చైర్మన్ పొలెబోయిన నర్సయ్యయాదవ్, ఈఓ కుశలయ్య, రఘువీర్ పూజలు నిర్వహించారు.



చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు

# ఇది సంక్షోభ ప్రభుత్వం

- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- ట్రిపుల్ ఆర్ రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

చౌటుప్పల్ రూరల్/చిట్యాల, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలు, రైతులు, విద్యార్థులు ఇలా ఏ ఒక్క వర్గానికీ సంక్షేమ పథకాలు అందడం లేదని, ఇది పూర్తిగా సంక్షోభ ప్రభుత్వంగా మారిపోయిందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు . ఖమ్మంలో బీసీ నాయకులతో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు ఇతర కార్యక్రమాలతో పాల్గొనడానికి వెళ్తున్న కవితకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిట్యాలలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కవితను స్వాగతించి పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో కవితకు గొర్రె పిల్లను బహూకరించారు. ఈ సందర్భంగా కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ రైతులకు న్యాయం చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకత్వంలో రైతులకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని తెలిపారు. స్వాగతం పలికిన వారిలో చౌటుప్పల్ మాజీ జడ్పీటీసీ పెద్దింటి బుచ్చిరెడ్డి, నాయకులు గిర్కటి నిరంజన్ గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బొళ్ల శివకుమార్, ఢిల్లీ మాధవరెడ్డి, మాచర్ల కృష్ణ, ఉడుగు మల్లేశం, చిన్నం బాలరాజు, గడ్డం యాదగిరి, మెరుగు శ్రీనివాస్, రామకృష్ణ, పిల్లలమర్రి సాయి, బీఆర్ఎస్ చిట్యాల పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు కొలను సునిత, కన్నెబోయిన జ్యోతీ బలరాం, జడల ఆదిమల్లయ్య, కూరెళ్ల లింగస్వామి, మెండె సైదులు, కొలను సతీశ్, సుంకరి యాదగిరి, బాలగోని రాజు, జిట్ట శేఖర్, ఆగు అశోక్, బందెల రాములు ఉన్నారు.



చిట్యాలలో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాయకులు



భువనగిరిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

# ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- మంత్రి పొన్నం దిష్టిబొమ్మ దహనం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 15 : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం భువనగిరి కొత్త బస్టాండ్ ఎదురుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలలో ప్రయాణికులు ఎక్కడం లేదన్నారు. దీనివల్ల ఆటో డ్రైవర్లు తమ పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయిలు, ఆటో ఇన్సూరెన్స్, ఈఎంఐలు కట్టలేక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని తెలిపారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేలతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిందని, అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా నేటికీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన మాట తప్పితే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గనబోయిన వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్ బాబు, నాయకులు కొత్త కృష్ణ, భూపాల్ రెడ్డి, వెంకటేశ్, గుర్రాల పాండు, బోడ చంద్రయ్య, బండి రమేశ్, బోయిని భిక్షపతి, రచ్చ మోహన్ దాస్, రాములు, వెంకటేశ్, రాజు, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మరోసారి కుల గణన సర్వే

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : తొలిసారి చేపట్టిన కుల గణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో వివిధ కారణాలతో నమోదు చేసుకోలేని వారి కోసం మరోసారి సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 28వ తేదీ వరకు సర్వే ఉంటుందని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టోల్ ఫ్రీ నంబర్ 040–21111111కు ఫోన్ చేయవచ్చని, ప్రజాపాలన సేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో ఫారం డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రజాపాలన కేంద్రాల్లో ఇచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాలకు నేరుగా వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సర్వే ఫారం ద్వారా https:// seeepcsurvey. cgg.gov.in సైట్‌లో నింపి సంతకం చేసి దగ్గరలో ఉన్న ప్రజా పాలన సేవా కేంద్రాల్లో ఇవ్వాలని తెలిపారు.

# చౌటుప్పల్ మండలంలో 1,500 కోళ్లు మృతి

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 15 : చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని కమ్మరి శంకరయ్య, సింగరాయ చెర్వు గ్రామంలోని సప్పిడి కృష్ణారెడ్డికి చెందిన ఫారాలలో శనివారం సుమారు 1,500 బాయిలర్ కోళ్లు మృతి చెందాయి. మృతి చెందిన కోళ్లను సమీపంలో పూడ్చిపెట్టారు. కోళ్ల మృతిపై ఆందోళన చెందిన రైతులు స్థానిక పశువైద్యాధికారి పృథ్వీరాజ్‌కు తెలుపడంతో ఆయన కోళ్ల ఫారాలను పరిశీలించారు. బర్డ్ ఫ్లూ లక్షణాలు కన్పించలేదని, గురక లాంటి వ్యాధితో కోళ్లు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ లేదని తెలిపారు.



చౌటుప్పల్ మండలం సింగరాయ చెర్వు గ్రామ పరిధిలోని ఫారంలో మృతి చెందిన కోళ్లు

# నేత్రదానం.. వెలుగుల ప్రదానం



## ఉద్యమంలా సాగుతున్న కార్నియా సేకరణ
## ముందుకు వస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

- 6 నెలల్లో 75 మంది నుంచి నేత్రదానం
- ప్రస్తుత నెలలోనే 18 మంది నుంచి సేకరణ
- నల్లగొండలో లయన్స్ భవన్ కేంద్రంగా నిర్వహణ
- సంప్రదించాల్సిన నంబర్ 9948143299

**చనిపోయిన ఓ వ్యక్తి నేత్రదానంతో బతికి ఉన్న ఇద్దరి కండ్లల్లో వెలుగులు నింపవచ్చన్న నినాదంతో నల్లగొండ కేంద్రంగా నేత్రదానం కార్యక్రమం ఉద్యమంలా కొనసాగుతున్నది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కార్నియాలు సేకరిస్తూ సంబంధిత ఆస్పత్రులకు అందిస్తూ అంధుల కండ్లకు చూపునిస్తున్నారు. చనిపోయిన వ్యక్తితోపాటు భూమిలో వృథాగా కలిసిపోయే కండ్లను సేకరించడం ద్వారా చూపుకోసం ఎదురుచూస్తున్న ఎంతో మందికి ఉపశమనం కలిగిస్తున్నారు. నల్లగొండలోని లయన్స్ క్లబ్ భవనం కేంద్రంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరు నెలలుగా నేత్రదాన కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతున్నది. గతేడాది ఆగస్టు 1 నుంచి నేత్రదానానికి శ్రీకారం చుట్టిన బృందం ఇప్పటి వరకు 75 మంది మృతుల నుంచి కార్నియాలు సేకరించింది. ప్రారంభంలో ప్రజల నుంచి అంతగా స్పందన లేకపోవడంతో కొంత మందకొడిగా మొదలైనా ప్రస్తుతం ఫిబ్రవరిలో రోజుకు ఒకరి నుంచి కార్నియా సేకరణ జరుగుతుండడం విశేషం.**

– నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి15(నమస్తే తెలంగాణ)

ప్రస్తుత పరిస్థితుల్లో అవయవదానం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పెరుగుతున్న వ్యాధులు, అనారోగ్యాల కారణంగా ఎంతో మందికి గుండె, కాలేయం, కిడ్నీ, కండ్ల లాంటి అవయవాల అవసరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అవయవదానానికి సైతం విస్తృత ప్రచారం లభిస్తున్నది. ఈ నేపథ్యంలో గ్రామీణ స్థాయిలో చాలా సులువైన నేత్రదానం కార్యక్రమంపైన నల్లగొండలోని లయన్స్ క్లబ్స్ అండ్ ఐఎంఏ వైద్యబృందం సభ్యులు దృష్టి సారించారు. ఒక అంచనా ప్రకారం దేశంలో 85 లక్షల నుంచి 95లక్షల మంది అంధులు ఉంటే వీరిలో 13 లక్షల నుంచి 15 లక్షల మంది వరకు కార్నియా అనే కంటి పొర లేక ప్రపంచాన్ని చూడలేకపోతున్నారు. ప్రస్తుతం దేశంలో ఏడాదికి సుమారు 45వేల వరకు మాత్రమే కార్నియాల సేకరణ జరుగుతున్నది. ఇదే ప్రకారం చూస్తే ప్రస్తుతం ఉన్న వారిందరికీ చూపు ప్రసాదించాలంటే కనీసం 30 సంవత్సరాలు సమయం తీసుకోనుంది. దీనికి తోడు మళ్లీ ప్రతి సంవత్సరం కొత్తగా 28వేల మంది వరకు కార్నియా అంధత్వం ఉన్న వారూ రిజిస్టర్ అవుతున్నారు. దీంతో కార్నియా సేకరణ అనేది దేశంలో అత్యావశ్యకత సంతరించుకుంది. అందువల్ల నల్లగొండ లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ దీనిపై దృష్టి సారించి ప్రజల్లోకి వెళ్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నది. ట్రస్ట్ చైర్మన్‌గా కేవీ ప్రసాద్ కొనసాగుతుండగా ఎండీగా ఉన్న డాక్టర్ హరినాథ్, మేనేజర్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ పుల్లారావు, కౌన్సిలర్‌గా చిరునోముల చంద్రశేఖర్ క్షేత్రస్థాయిలో కీలకంగా ఉండి దీన్ని ముందుకు తీసుకుపోతున్నారు.

**నేటికి 75 మంది నుంచి సేకరణ**

2024 ఆగస్టు 1 నుంచి దీనికి ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో అంతగా స్పందన కనిపించలేదు. అంటే ఇందులో మృతి చెందిన వారి వివరాలు సేకరించడమే కీలకం. ఆ విషయం తెలుసుకోవడం, ఆ తర్వాత వారి కుటుంబ సభ్యులకు కలిసి నేత్రదానం గురించి వివరించి ఒప్పించడం కొంచెం ఇబ్బందికరంగానే ఉండేది. కానీ తర్వాత వివిధ మార్గాల ద్వారా మృతుల వివరాల సేకరణపై ఎక్కువ దృష్టి పెట్టారు. అందుకోసం వాట్సాప్ స్టేటస్‌లు, ఫేస్‌బుక్‌లో శ్రద్ధాంజలి పోస్టింగ్స్, పట్టణ కూడళ్లల్లో వెలిసే మృతుల ఫ్లెక్సీ ఫొటోలపై ఆధారపడ్డారు. దీంతో వివరాల సేకరణ కొంత సులువైంది. ఇదే సమయంలో కార్నియా సేకరించిన అనంతరం దాతల ఫొటోలతో పాటు, సేకరణ దృశ్యాలను సైతం సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా ప్రచారం కల్పించే ప్రయత్నం చేశారు. దీంతో గత ఆరు నెలల్లో నేత్రదానికి మెల్లమెల్లగా స్పందన పెరుగుతూ వచ్చింది. ఇలా ఫిబ్రవరి 15వ తేదీ నాటికి మొత్తం 75 మంది నుంచి 150 కార్నియాలను సేకరించారు. తొలి మూడ నెలలు పెద్దగా లేకపోయినా నవంబర్ నుంచి నేత్రదానం చేసే వారి సంఖ్య పెరిగింది. ఆగస్టులో 4, సెప్టెంబర్‌లో 4, అక్టోబర్‌లో 3 రాగా నవంబర్‌లో 10, డిసెంబర్‌లో 16, జనవరిలో 20 మంది నేత్రదానానికి ముందుకు వచ్చారు. ఇక ప్రస్తుత ఫిబ్రవరిలో రోజుకు ఒకరి నుంచి గత15 రోజుల్లోనే 18 మంది నుంచి కార్నియాలు సేకరించారు. రానున్న కాలంలో మరింత ఎక్కువ మంది నుంచి సేకరించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు కౌన్సిలర్ చిరునోముల చంద్రశేఖర్ వెల్లడించారు. తమ కుటుంబంలో ఎవరు చనిపోయినా సకాలంలో తమకు వివరాలు అందిస్తే వెళ్లి తామే కార్నియాలు సేకరిస్తామని ఆయన వివరించారు.



నల్లగొండలో దాత నుంచి నేత్రాలను స్వీకరిస్తున్న ట్రస్టు సభ్యులు

### సమాచారం ఇస్తే చాలు



మృతుల సమాచారం తెలుసుకోవడమే ఇందులో కీలకం. ఎవరైనా సరే సమాచారం ఇస్తే గంటలోపే అక్కడికి చేరుకోగలం. మృతుల కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియా సేకరణ చేస్తాం. సమాచారం తెలుసుకోవడమే తమకు పరీక్షగా మారుతున్నది. ఇందుకోసం ఇప్పటికే పట్టణంలోని ఆస్పత్రులను సంప్రదిస్తున్నాం. వాట్సాప్ స్టేటస్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం పోస్టింగ్స్ గమనిస్తున్నాం. ఫ్లెక్సీ షాపులను అలర్ట్ చేశాం. వివిధ సంస్థల ప్రతినిధులను అడుగుతున్నాం. ప్రారంభంతో పోలిస్తే ప్రస్తుతం సమాచారం కొంత మెరుగైంది. ఇంకా ప్రజల సహకారం కూడా చాలా అవసరం. ఎవరైనా సరే తమ కుటుంబంలో గానీ, బంధువుల్లో గానీ, కాలనీలో గానీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో చనిపోయిన వ్యక్తుల సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి. దీంతో చనిపోయిన వ్యక్తి మరో ఇద్దరి వ్యక్తులకు చూపును ప్రసాదించి చిరంజీవులుగా నిలుస్తారు.

– చిరునోముల చంద్రశేఖర్, ట్రస్ట్ కౌన్సిలర్

### కనుగుడ్డుపై పొరనే సేకరిస్తాం



నేత్రదానం చేయడం చాలా సులువు. చనిపోయిన వ్యక్తుల నుంచి మాత్రమే సేకరణ జరుగుతుంది. అది కూడా కేవలం కనుగుడ్డుపైన ఉన్న పల్చటి పొరను మాత్రమే సేకరిస్తాం. అందువల్ల ఎవ్వరికీ ఇబ్బంది ఉండదు. కానీ నేత్రదానం(కార్నియా సేకరణ) వల్ల చూపు లేని అంధులకు ప్రపంచాన్ని చూపించవచ్చు. దీనివల్ల చనిపోయిన వ్యక్తి కండ్లకు జీవం పోసిన వాళ్లం అవుతాం. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. మృతుల కుటుంబాలు స్వచ్ఛందంగా ముందుకు వస్తే దేశంలో ఎంతో మంది కండ్లల్లో వెలుగులు నింపవచ్చు. ఇందులో వివిధ సంస్థల, ప్రముఖుల, ప్రజల భాగస్వామ్యం పెరుగాల్సి ఉంది.

– డాక్టర్ హరినాథ్, ఎండీ, చారిటబుల్ ట్రస్ట్

### నేత్రదానం ఇలా..

- నేత్రదానం అంటే నల్లటి కనుగుడ్డుపై ఉండే పల్చటి పొర(కార్నియా)ను సేకరించడమే. కనుగుడ్డును తీయరు.
- ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు నుంచి నలుగురు అంధులకు కంటిచూపునకు అవకాశం.
- మూడు సంవత్సరాల వయస్సు పైబడిన వారెవరైనా నేత్రదానం చేయవచ్చు.
- మరణానంతరం 6 నుంచి 8 గంటల లోగా నేత్రదానం చేయించాలి.
- ఒకవేళ పార్థివదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచితే 12 నుంచి 15 గంటలలోగా కార్నియ సేకరణ జరుపవచ్చు.
- స్త్రీలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్స్ నుంచి కూడా కార్నియా సేకరణ చేయవచ్చు.
- కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారూ, కళ్లద్దాలు పెట్టుకున్న వారూ సైతం నేత్రదానం చేయవచ్చు.
- షుగర్, బీపీ ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు కూడా అర్హులే.
- HIV, HBSAg, VDRL, RABIS, Blood Cancer మొదలగు వారు మాత్రమే నేత్రదానానికి అనర్హులు.
- సేకరించిన నేత్రాలను(కార్నియా) హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్, వాసన్, అగర్వాల్ ఐ బ్యాంకులకు అందజేత. వీటిని ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అవసరాన్ని బట్టి ఎక్కడైనా సరే వినియోగించవచ్చు.
- సేకరించిన కార్నియాలను ప్రత్యేక సీసాల్లో భద్రపరిచి గరిష్ఠంగా పది రోజుల్లోగా కెరిటోప్లాస్టి ఆపరేషన్ ద్వారా అమర్చి కంటిచూపు తెప్పిస్తారు.
- నేత్రదానంపై మరింత సమాచారం కోసం 9948143299(చంద్రశేఖర్)ను 24/7 సంప్రదించవచ్చు.




